

ప్రార్థనలో పాల్గొన్న పీఠాధిపతి, వివిధ పార్టీల నాయకులు, ముస్లింలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

● జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు

కడప (కల్చరల్), జూన్ 17: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని సోమవారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలలో గురువుల సందేశాన్ని విన్నారు. పవిత్ర దైవగ్రంథంగా భావించే ఖురాన్ సందేశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని మత గురువులు బోధించారు. ప్రధానంగా నేటి సమాజంలో దారి తప్పిన వారికి సన్మార్గం చూపేందుకు ఆ దేవుడు పంపిన వార్తా హరుడు హజరత్ ఇబ్రహీం అన్నారు. త్యాగనిరతికి ప్రతీక అయిన బక్రీదు సందర్భంగా ముఖ్యంగా ఉన్న వారు లేని వారికి తోడ్పడేలా దానగుణాన్ని, త్యాగనిరతిని అలవరచుకోవాలని ఉపదేశించారు. కడప నగర బిల్టప్ వద్ద గల ఈద్గాలో మత గురువు న్యాయమతుల్లా బక్రీద్ దైవసందేశాన్ని ఇచ్చారు. పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లాహుసేని బక్రీద్ నమాజ్ చేయించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, అమీర్‌బాబు, అఫ్జల్‌ఖాన్, సుభాన్ బాష తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలింగనం చేసుకుని పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

నలుగురు సీఐల బదిలీ

కడప (క్రైం), జూన్ 17 : జిల్లాలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప వీఆర్‌లో పనిచేస్తున్న జె.శివశంకర్‌ను మైదుకూరు రూరల్ కు బదిలీ చేశారు. మైదుకూరు రూరల్‌లో పనిచేస్తున్న శ్రీనాథ్‌రెడ్డి కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు. కర్నూలు వీఆర్‌లో ఉన్న రామాంజనేయుడు మైదుకూరుకు, మైదుకూరులో పనిచేస్తున్న ఏపీ మస్తాన్‌ను కడప వీఆర్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన వారు తక్షణమే వారికి కేటాయించిన స్థానాల్లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కూతురే హంతకురాలు

● నిందితురాలు హరిత అరెస్టు

మదనపల్లె అర్బన్, జూన్ 17: కన్న కూతురే, తండ్రిని హత్య చేసిందని డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను వివరించారు. డీఎస్పీ కథనం మేరకు.. స్థానిక పీఅండ్‌టీ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు ఇ.దొరస్వామి (62)ని కుమార్తె హరిత ఈనెల 12వ తేదీ రాత్రి హత్య చేసింది. ప్రియుల మోజులో పడిన కుమార్తె, తండ్రి చూసిన పెళ్లి సంబంధాలను తిరస్కరిస్తోంది. ఈ విషయమై ఇద్దరి మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. అలాగే హరిత మదనపల్లెకు చెందిన సాయికృష్ణ, రమేశ్, హరీష్‌రెడ్డిలతో చనువుగా ఉండటంతో తండ్రి దొరస్వామి కుమార్తెను పలుమార్లు మందలించాడు. ఈ క్రమంలో హరిత ప్రియుడిగా చెబుతున్న రమేశ్‌కు బంగారు నగలు ఇవ్వగా అతను బజాజ్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.11.40 లక్షలు తీసుకున్నాడు. అలాగే సాయికృష్ణకు రూ.8 లక్షల నగదు ఇచ్చిందన్నారు. అలాగే హరీష్‌రెడ్డితో కూడా చనువుగా ఉంది. ఉన్న డబ్బులు, బంగారం ఇచ్చేయగా తాను చూసిన పెళ్లి సంబంధాన్ని ఒప్పుకోకపోవడంతో తండ్రి, కూతురు తరచుగా గొడవ పడుతున్నారు. ఇందులో భాగంగా ఈనెల 12వ తేదీ ఇద్దరూ గొడవపడ్డారు. రాత్రి 10.30 గంటలకు గొడవపడే క్రమంలో మిద్దెపైన తాళం కప్పతో తండ్రి తలపై మోదింది. రక్తస్రావం కావడంతో దొరస్వామి కింద ఇంట్లోకి వచ్చి తనకు తగిలిన దెబ్బను చూడటానికి సెల్‌లో సెల్ఫీ వీడియో తీశాడు. అనంతరం మళ్లీ మిద్దెపైకి వెళ్లి మద్యం తాగి కూతురుతో మళ్లీ గొడవకు దిగాడు. కూతురు ఆవేశంతో రైటింగ్ ప్యాడ్‌తో, చపాతి రుద్దె కర్రతో, కరాటే స్టిక్‌తో విచక్షణారహితంగా కొట్టి హత్య చేసింది. రక్తపు మడుగులో పడి ఉన్న దొరస్వామిని చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే దొరస్వామి మృతి చెందాడు. మృతుడి బంధువు నారాయణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితురాలు హరితను అరెస్టు చేయడంతో పాటు హత్యకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో మదనపల్లె వన్‌టౌన్ సీఐ వల్లిబసు, రూరల్ సీఐ శేఖర్, వన్‌టౌన్ సీఐ యువరాజు పాల్గొన్నారు.



నిందితురాలు హరిత (ఫైల్)



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

పాడా నిధులపై ఆరా

● ఏ పనులకు ఎంత ఖర్చు చేశారు..
● ఎక్కడెక్కడ పనులు చేపట్టారు..
● వివరాలు రాబట్టే పనిలో టీడీపీ
● కలవరపడుతున్న వైసీపీ



పాడా పులివెందుల వైసీపీ నాయకులకు పాడి ఆవు. పిండుకున్నోనికి పిండుకున్నంత అన్నట్లు పాడా ద్వారా కోట్ల రూపాయలు కొల్లగొట్టారనే విమర్శలున్నాయి. కోటి రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పనికి రెండింతలు పెట్టారు. చేసిన పని మళ్లీమళ్లీ చేసిన ఘనత పాడాకు ఉంది. ఇక ఇక్కడ వేల కోట్లు నిధులు కుమ్మరించినా.. అంత స్థాయిలో అభివృద్ధి పనులు జరగలేదని.. నిధులను కూడా ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేశారని.. పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో పాడా నిధులపై ఆరా తీస్తున్నారు. ఏ పనులకు ఎంత ఖర్చు చేశారు.. ఎంత వృథా చేశారు... తదితర వివరాలను రాబడుతున్నారు. దీంతో మళ్లీ మా ప్రభుత్వం వస్తుందనే అహంకార ధోరణిలో ఉన్న వైసీపీ నేతల గుండెల్లో గుబులు మొదలైంది.

పులివెందుల, జూన్ 17: పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు దాదాపు రూ.5000 కోట్ల పైచిలుకు నిధులు పులివెందులకు మళ్లించారు. ఈ నిధులను ఇష్టం వచ్చినట్లు వాడేశారని టీడీపీ తీవ్ర విమర్శ చేస్తోంది. ఇక మేము అధికారంలోకి వచ్చాం.. పాడా నిధులపై నిఘా పెడతామని కొందరు నాయకులు బహిరంగంగానే అంటున్నారు. సీసీ రోడ్ల దగ్గర నుంచి భవన నిర్మాణాల వరకు అనేక అభివృద్ధి పనులు పులివెందులలో చేపట్టారు.

ఈ నిధులన్నీ ఆయా గ్రామాల్లోని చోటామోటా నాయకులకు అప్పగించి పనులు చేశారు. పెద్ద పెద్ద పనులు మాత్రం వైసీపీ కీలక నేతలు బినామీలకు అప్పగించి పనులు చేయించినట్లు టీడీపీ ఆరోపిస్తోంది.

కోట్ల రూపాయలు దుర్వినియోగం

వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే పాడా నిధులను ఏకంగా సాగునీటి శాఖ పనులకు కేటాయించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఏ పనికి ఎంత ఖర్చు చేస్తున్నారో.. నిధులకు సంబంధించి సమాచారం అడిగితే మాత్రం పాడాలో ఏ అధికారి పలకడం లేదని టీడీపీ నేతలే అంటున్నారు. ముఖ్యంగా వాటర్ గ్రిడ్ పనులకు సంబంధించి పైప్‌లైన్లు, వాటర్ ట్యాంకర్ల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో అంతుబట్టని వైనం. సూక్ష్మనీటి సేద్యం పను లు రెండో విడత చేపట్టామని గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పినా ఆ పనులు ఎక్కడా సాగలేదు. జగనన్న లేఅవుట్‌లో కూడా అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. పనులన్నీ అధ్వానంగా సాగుతున్నా పట్టించుకునేనాథుడే లేడు. పులివెందుల చుట్టూ ఉన్నరింగు రోడ్డు సుందరీకరణపనుల పేరుతో కోట్ల రూపాయలు నిధులను దుర్వినియోగం చేశారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. రింగురోడ్డులో గతంలో విద్యుత్‌దీపాల స్తంభాలు ఉన్నప్పటికీ వాటిని తొలగించి వాటి స్థానంలో లక్షలు ఖర్చుచేసి కొత్తవి ఏర్పాటు చేశారు. అలాగే రింగురోడ్డులో వివిధ కూడళ్లలో చేపట్టిన పనులపై విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్ల విస్తరణలో భాగంగా చేపట్టిన పనులు కూడా కొన్ని అర్థాంతరంగా ఆపేశారు. పులివెందుల నియోజకవర్గంలో జరిగిన రింగురోడ్డు నిర్మాణంలో భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు వేసి ఆయా రోడ్లల ఏర్పాటు చేయాల్సిన బ్రిడ్జిలు మాత్ర ఏర్పాటు చేయకుండా వదిలేశారు. ఇక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ చోటామోటా నాయకులకు లక్ష నుంచి ఐదు, పది, ఇరవై లక్షల రూపాయలు స్థాయిని బట్టి గ్రామీణ రోడ్ల పనులు అప్పగించారు. వీటిని కూడా ఇష్టమొచ్చినట్లు నిర్మించినట్లు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

అంత గోప్యం ఎందుకో..

పాడా పరిధిలో సాగిన అభివృద్ధి పనుల వివరాలను అధికారులు బయటకు పొక్కనీ యడం లేదు. పాడా అంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిందా లేక ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేసిందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాడా ఖర్చు కింద నిధులు అంతా ప్రజాధనమే. కానీ పులివెందులలో సాగిన అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు. ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేస్తున్న సమయంలో ఎన్ని కోట్లతో ఏర్పాటు చేస్తున్నారో అంటే పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వకపోవడం సాధారణం. కానీ ప్రభుత్వం ఖర్చు చేస్తున్న నిధులు చెప్పకపోవడం దారుణం. పాడాలో దాదాపు రూ.5000 కోట్ల పైచిలుకు నిధులు ఖర్చు చేసినట్లు సమాచారం. దీంతో పాడాలో అంత ఖర్చుతో పనులు చేశారా.. అనే ఆశ్చర్యంతో కూడిన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక నిధుల వివరాలపై పాడా అధికారులు గోప్యత పాటిస్తుండటంతో... పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ నేపథ్యంలో నిధుల వివరాలు వెల్లడించాల్సిందేనని టీడీపీ నేతలు పట్టుబడుతున్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవిలు పాడా అధికారులపై మండిపడినట్లు తెలిసింది. ఏ పనికి ఎంత ఖర్చు చేశారో, ఏ మేర బిల్లులు అందించారో, ఎక్కడెక్కడ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటినంత త్వరగా ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఇప్పటి వరకు బిల్లులు కాని పనులు ప్రభుత్వం మారిన సందర్భంలో చెల్లిస్తే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని, మున్సిపల్ మరియు పాడా అధికారులకు టీడీపీ నుంచి హెచ్చరికలు జారీ అయినట్లు తెలిసింది.

బీసీ గురుకుల ప్రవేశాలకు రెండు విడతలుగా పరీక్షలు

● ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో ఒక్కో సెంటర్ మాత్రమే

కలికిరి, జూన్ 17: జ్యోతీబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం ముందు ప్రకటించినట్టు కాకుండా రెండు విడతల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. మొదట ప్రకటన మేరకు ఈ నెల 20న ప్రవేశ పరీక్షలు జరగాల్సి వుండగా ప్రస్తుతం 21వ తేదీ కూడా పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే పరీక్షా కేంద్రాలు మాత్రం ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలో ఒక్కో కేంద్రంలో మాత్రమే జరుగనున్నాయి. చిత్తూరు జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలల ప్రవేశాల కోసం కలికిరి, కడప జిల్లాలోని పాఠశాలలకు నందలూరులో మాత్రమే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గతంలో ఈ పాఠశాలలకు జరిగిన అడ్మిషన్లు పోనూ మిగులు సీట్ల భర్తీ కోసం ఇటీవల ప్రకటన జారీ చేశారు. అయితే పదుల సంఖ్యలో వున్న ఖాళీల భర్తీ కోసం వేల సంఖ్యలో అనూహ్య రీతిలో దరఖాస్తులు రావడంతో రెండు విడతల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించక తప్పడం లేదని జిల్లా కన్వీనరు వై. సోమశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాలోని బాలికల కోసం కలికిరి, ఉదయమాణిక్యం, పీలేరు, పెద్దపంజాణి, పులిచెర్ల, బాలుర కోసం చదుం, సత్యవేడు, ఐతేపల్లె, తంబళ్లపల్లె (అంగళ్ళు), కుప్పంలోని పాఠశాలల్లో అడ్మిషన్లు కోరే విద్యార్థులకు కలికిరి కేంద్రంగా మాత్రమే పరీక్షలు జరుపనున్నారు. అదే విధంగా కడప జిల్లాలోని బాలికల కోసం నందలూరు, వన్నెపెంట, తొండూరు, బాలుర కోసం జమ్మలమడుగు, కమలాపురం పాఠశాలల్లో ప్రవేశాలు కోరే వారికి నందలూరు కేంద్రంగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 20న 6, 8 తరగతుల వారికి, 21వ తేదీన 7, 9 తరగతుల్లో ప్రవేశాలు కోరే వారికి విడివిడిగా రెండు రోజులపాటు పరీక్షలుంటాయి. ఈ రెండు పరీక్షలు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకూ జరుగతాయి. 3.10 గంటల తరువాత ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించరు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని, విడిగా పోస్టు ద్వారాగానీ, నేరుగా కానీ అభ్యర్థులకు పంపడం లేదని సోమశేఖర్ వివరించారు. గతేడాది చదివిన తరగతులకు సంబంధించిన సిలబస్ మేరకు తెలుగు 20, ఇంగ్లీషు 20, గణితం 20, సైన్సు 20, సోషియల్‌కు 20 మార్కుల వంతున కేటాయించినట్లు చెప్పారు. ప్రశ్నపత్రం ఆంగ్లంలో మాత్రమే వుంటుదని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని ఏవైనా ఇతర సందేహాలుంటే 98852 25352, 87900 92069 నంబర్లలో సంప్రదించాలని సోమశేఖర్ కోరారు.

పులి సంచారం నిజమే !

● మర్రిపాడు ఘటనతో అధికారుల నిర్ధారణ
● ఉమ్మడి నెల్లూరు, కడప జిల్లాల పరిధిలో గతంలోనే పాదముద్రల గుర్తింపు
● ఎన్ని ఉన్నాయన్నదానిపై సందిగ్ధం
● అది పెద్దపులా.. లేక చిరుత పులా అనేది తేలాల్సి ఉంది.
● భయాందోళనలో ప్రజలు



గత ఏడాది మర్రిపాడు మండలం చాబోలు, వెంకటాపురం పాయలో కనిపించిన పులి పాద ముద్రలు(ఫైల్)

ఆత్మకూరు, జూన్ 17: జిల్లాలోని అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గతంలోనే గుర్తించారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలోని చాబోలు, వెంకటాపురం పాయలో అటవీ సిబ్బంది పులి పాదముద్రలను గుర్తించడమే కాకుండా, కొంతమంది స్థానికులు ప్రత్యక్షంగా చూసినట్లుగా కూడా చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో సోమవారం మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి కారుపై దాడి చేసినట్లుగా కారు డ్రైవర్ పేర్కొన్నారు. అయితే అది పెద్దపులి కాకపోవచ్చని చిరుతపులి అయి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తు న్నారు. ఈ క్రమంలో జిల్లా అటవీ ప్రాంతంలో ఎన్ని పులులు ఉన్నాయన్నది సందిగ్ధంలో ఉన్నామని వారు పేర్కొన్నారు. జిల్లా అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నది ఒక పులేనా..? లేక రెండు, మూడు ఉన్నాయా.. అన్నది అధికారులు నిర్ధారించాల్సి ఉంది. ఉమ్మడి నెల్లూరు, కడప జిల్లాల పరిధిలోని పెనుశిల నరసింహ అభయారణ్యం, లంకమల్లేశ్వర అభయారణ్యం కలిసి 3.8 లక్షల ఎకరాలకు పైగా విస్తరించి ఉన్నాయి. కడప జిల్లాకు సమీపంలో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో 2022 సెప్టెంబరులో క్షేత్ర సిబ్బంది మొదటిసారిగా పులి పాదముద్రలను గుర్తించారు. ఆ తరువాత 2023 జనవరి, ఫిబ్రవరిలో మరికొన్ని ప్రాంతాల్లో పులి పాదముద్రలతో పాటు జంతు కళేబరాలను కూడా గుర్తించారు. ఈ కళేబరాలను బట్టి ఆత్మకూరు అటవీ ప్రాంతంలో సంచరించే పులి మూడు ఆవులను చంపినట్లుగా అటవీశాఖలోని బేస్ క్యాంపుల్లోని సిబ్బంది గుర్తించారు. కాగా జిల్లా అటవీ ప్రాంతంలో ఎన్ని పులులు ఉన్నాయి.. ఎంత దూరం అవి సంచరించాయి...? అని నిర్ధారించే పనిలో అటవీశాఖ అధికారులు నిగ్నమయ్యారు. పులి సంచారం వార్తల నేపథ్యంలో ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

హీరోలు.. జీరోలు...
జీరోలు. హీ రోలు



● రాజంపేటలో తల్లకిందులైన రాజకీయం
● ఓటమితో టీడీపీలో వైరాగ్యం
● ఎమ్మెల్యే గెలిచినా వైసీపీలో నిరుత్సాహం
● ఎన్నికల ముందు వరకు ఒక్క వెలుగు వెలిగిన నేతలు
● ఎన్నికల తర్వాత రాజకీయ ఎదురీత



రాజంపేట, జూన్ 17:

రాజకీయాల్లో ఓడలు బండ్లు అవ్వడం.. బండ్లు ఓడలు అవ్వడం సర్వసాధారణం. అదే క్రమంలో ఏ నాడూ ఎన్నికలకు ముందు కానరాని నేతలంతా హీరోలు అవ్వడం, ఎన్నికల్లో అనేక రాజకీయ ఒడిదుడుకుల వల్ల ఓ వెలుగు వెలిగి హీరోలుగా ఉన్నవారు జీరోలు అవుతుంటారు. ఆ క్రమంలో రాజంపేట నియోజకవర్గంలో ఎన్నికల తర్వాత రెండు పార్టీల్లోనూ నిరుత్సాహం కనపడుతోంది. ప్రధానంగా రాష్ట్రమంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించి చరిత్ర సృష్టించగా రాజంపేటలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఓటమి చెందడంతో ఆ పార్టీ నియోజకవర్గంలో నిరాశ, నిస్పృహలకు లోనైంది. రాష్ట్రమంతా తాము అధికారంలోకి వచ్చామన్న ఆనందం వీరిలో కనబడడం లేదు. కారణం రాజంపేట ఎమ్మెల్యే స్థానాన్ని గెలవలేకపోవడం వల్లే టీడీపీ క్యాడర్‌లో ఉత్సాహం లేకుండాపోయింది. రాజంపేటలో ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వైసీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే రాష్ట్రంలో వైసీపీ కుప్పకూలిపోవడంతో రాజంపేటలో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపొందినా వైసీపీ క్యాడర్‌లో ఆనందం లేకుండా పోయింది. అధికారంలోకి వచ్చిన టీడీపీకి రాజంపేట సీటు గెలవకపోవడంతో ఎంత నిరాశకు గురైందో, ఎమ్మెల్యే స్థానం గెలుపొందిన వైసీపీకి రాష్ట్రంలో అధికారం రాకపోవడంతో అదే నిరుత్సాహం నెలకొంది. ఈ విధంగా ఇరుపార్టీల క్యాడర్ రాజంపేట నియోజకవర్గంలో పూర్తిగా రాజకీయ నిస్తేజంలో ఉంది.

ఎన్నికల ముందు వరకు హీరోలుగా ఓ వెలుగు వెలిగిన నేతలు ఎన్నికల తర్వాత జీరోలుగా మారారు. రాజంపేట టీడీపీ ఎంపీ అభ్యర్థిగా గంటా నరహరిని చంద్రబాబు స్వయంగా ప్రకటించడంతో ఆయన ఏడాదిన్నరపాటు పార్లమెంట్ పరిధిలో ఓ వెలుగు వెలిగారు. ఎన్నికల్లో ఆయనకు ఏ టిక్కెట్ రాకపోవడంతో ఆయన ఇప్పుడు జీరోగా మారారు. అర్థబలం, అంగబలంలో మేటిగా నిలిచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి జిల్లాలోనే ఓ వెలుగు వెలిగారు. ఒకసారి టీడీపీ తరపున, మరోసారి వైసీపీ తరపున ఆయన ఎమ్మెల్యేగా కొనసాగారు. టీడీపీ హయాంలో జిల్లాలో ఎమ్మెల్యేగా గెలుపొందింది మేడా ఒక్కరే. అధికార టీడీపీలో ఆయన ఒక్కరు గెలిచి ఉమ్మడి కడప జిల్లాలో ఏకఛ్రతాధిపత్యం వహించారు. మొన్న జరిగిన ఎన్నికల్లో మూడోసారి ఆయన తిరిగి పోటీ చేస్తారని ప్రచారం కూడా జరిగింది. ఇంతలో ఆయనకు టిక్కెట్ ఇవ్వడంలో వైసీపీ మొండిచేయి చూపింది. ఆయన తమ్ముడు మేడా రఘునాథరెడ్డికి రాజ్యసభ స్థానం ఇచ్చారు. ఇక టిక్కెట్ రాని మేడా ప్రస్తుతం మాజీగా మారిపోయి ఆయన రాజకీయం నేడు ప్రశ్నార్థకంగా మారిపోయింది. రాజంపేట టీడీపీ మాజీ ఇన్‌చార్జ్‌కి టీడీపీ ఎమ్మెల్యే టిక్కెట్ వస్తుందని భావించారు. ఆయనకు టిక్కెట్ రాకపోవడంతో ఆయన రాజకీయ పరిస్థితి కూడా తారుమారైంది.

రైల్వేకోడూరులో టీడీపీ ఇన్‌చార్జ్‌గా సుమారు 15 సంవత్సరాలు కొనసాగి కోడూరు రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన కస్తూరి విశ్వనాథనాయుడుకు ఎన్నికల ముందు ఇన్‌చార్జ్ పదవి నుంచి తొలగించడంతో టీడీపీ అధికారంలోకి వచ్చిన సమయంలో ఆయనకు నియోజకవర్గ పగ్గాలు లేకుండా పోయాయి. ఇదే క్రమంలో ఇంజనీరింగ్ చదివి సర్పంచిగా ఉన్న అరవ శ్రీధర్ అనూహ్యంగా కోడూరులో జనసేన తరపున ఎమ్మెల్యేగా గెలుపొంది నేడు రాజకీయ హీరోగా మారిపోయారు. ఆయన గెలుపులో కీలక పాత్ర పోషించి కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ బాధ్యతలను ఎన్నికలకు ముందు తీసుకుని నేడు రైల్వేకోడూరు రాజకీయాల్లో అనూహ్యంగా ముక్కా రూపానందరెడ్డి రాజకీయ హీరోగా మారిపోయారు. ఈ విధంగా ఎన్నికల తర్వాత రాజంపేట, కోడూరుల్లో రాజకీయ ముఖచిత్రమే మారిపోయింది. హీరోలుగా ఉన్న నేతలు జీరోలుగా... జీరోలుగా ఉన్న నేతలు హీరోలుగా మారిపోయారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ అద్దె బస్సు

● ఇద్దరు దుర్మరణం ● భార్యాభర్తలకు గాయాలు



మృతి చెందిన సాయిగురురోహిత్



గాయపడిన లక్ష్మీదేవి

కడప (క్రైం), జూన్ 17: పది నిమిషాల్లో వారంతా గమ్యస్థానానికి చేరుతారు. ఇంతలోనే వారు ప్రయాణిస్తున్న కారును అతివేగంగా వచ్చిన ఆర్టీసీ అద్దెబస్సు ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందగా.. మరో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. కడప నగరంలోని ఓ కుటుంబం పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను గురప్పస్వామి వద్ద మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి.. తిరిగి కడప బయల్దేరారు. కడప నగర శివార్లలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారును ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. భార్యాభర్తలైన మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటనపై పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా..

కడప నగరంలోని భాగ్యనగర్ కాలనీలో నివాసం ఉంటూ మేస్త్రీగా పనిచేస్తున్న దూదిశెట్టి రామయ్య (55), ఉక్కాయపల్లెకు చెందిన దాదిబోయిన రాజమోహన్ (55) స్నేహితులు. ఇటీవలే రామయ్య ఎథియోస్ కారును కొన్నాడు. ఈక్రమంలో రాజమోహన్ తన కుటుంబంతో కలిసి దూదిశెట్టి రామయ్య కారులో పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను గురప్పస్వామికి మొక్కు చెల్లించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రామయ్య తన కారులో సోమవారం ఉదయాన్నే రాజమోహన్, అతని భార్య లక్ష్మీదేవి(47) వీరి కుమారుడు దాదిబోయిన సాయి గురురోహిత్ (25)లతో కలిసి కడప నుంచి బయలుదేరి పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను గురప్పస్వామికి చేరుకున్నారు. అక్కడ తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించి తిరిగి కడపకు బయల్దేరారు. కడప నగర శివార్లలోని గురుకుల పాఠశాల సమీపంలోకి వచ్చేసరికి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో దూదిశెట్టి రామయ్య, దాదిబోయిన సాయిగురురోహిత్ అక్కడికక్కడే మృతి చెందారు. రాజమోహన్, అతని భార్యలక్ష్మీదేవికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌లో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనాస్థలాన్ని కడప రిమ్స్ పీఎస్ పోలీసులు పరిశీలించారు. కారులో ఇరుక్కున్న రెండు మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



కారును ఢీకొన్న ఆర్టీసీ అద్దె బస్సు

ఎదురుచూపులు ఇంకెన్నాళ్ళు?

- ఖరీఫ్‌లోనూ మొండి చెయ్యి
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపులు
- ప్రభుత్వం నిర్లక్ష్యం రైతులకు శాపం

సుండుపల్లె, జూన్17: ఖరీఫ్ సీజన్‌లో కళకళలాడాల్సిన పింఛా ప్రాజెక్టు వెలవెలబోతోంది. వైసీపీ హయాంలో పాలకుల నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివర్ తుఫాను కారణంగా 2020 నవంబర్-26వ తేదీన ప్రాజెక్టు మట్టికట్ట తెగిపోవడంతో దిగువ భాగంలో ఉన్న రైతుల మామిడి చెట్లు, పంట పొలాలు కొట్టుకుపోయాయి. పెద్ద సంఖ్యలో రైతులకు ఆస్తినష్టం వాటిల్లింది. అలాంటి రైతులను ఆదుకోవడం లోనూ వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రాజెక్టు తెగిపోవడంతో అష్టకష్టాలు పడిన రైతులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఎదురైంది. సీపీఐ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ సమన్వయంతో వందలాది మంది రైతులు, ప్రజలు పింఛా ప్రాజెక్టు వద్ద నుంచి అన్నమయ్య జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వరకు సుమారు 40 కిలోమీటర్లు పాదయాత్ర చేయడంతో, ప్రాజెక్టు పనులు చేసేందుకు అనుమతులు వచ్చాయి. రూ.84.33 కోట్ల అంచనా వ్యయంతో 2023 మార్చి నెలలో పనులు ప్రారంభించారు. ఇప్పటికీ ఆ పనులు పూర్తి కాకపోవడం, ఖరీఫ్ సీజన్ మొదలవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సకాలంలో వర్షాలు పడుతున్నా, నీరు వృథాగా ఏటి పాలవుతోంది. త్వరగా పనులు పూర్తి చేసి పుణ్యం కట్టుకోవాలని దిగువ ప్రాంతంలోని రైతులు కోరుతున్నారు.


ఏజెన్సీ ప్రాంతాల వరప్రసాదిని పింఛా ప్రాజెక్టు:
పింఛా, పెద్దినేనికాల్వ, రాయవరం, మాచిరెడ్డిగారిపల్లె ప్రాంతాల ప్రజలకు పింఛా ప్రాజెక్టు వరప్రసాదం లాంటిది. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో ఒకప్పుడు నాగరిక సమాజానికి దూరంగా ఉండే తాండాల దశ తిరిగింది. సుండుపల్లె మండలంలోని దాదాపు 15 గిరిజన తాండాల ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడినాయి. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద సుమారు 4,472 ఎకరాల సాగు భూమి ఉంది. ప్రాజెక్టు పూర్తై పూర్తి సామర్థ్యంతో నీటిని నింపితే ఏడాది పాటు రైతులు రెండు సార్లు పంటలు సాగు చేసుకునే వీలు ఉంటుంది.



మట్టికట్ట తెగిపోయిన చోట్ల పూర్తైన పనులు



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న ఎడమకాలువ



ప్రాజెక్టు మట్టి కట్ట కొట్టుకుపోయిన ప్రదేశంలో 150 మీటర్లు కాంక్రీట్‌తో నాన్ ఓవర్‌ఫ్లో డ్యాం (ఎన్‌వోఎఫ్) పనులు పూర్తి అయ్యాయి. గతంలో ఉన్న మట్టి కట్ట స్థానంలో ఇప్పుడు పూర్తి స్థాయిలో కాంక్రీట్‌తో నిర్మించినట్లు అధికారులు చెబుతున్నారు. మట్టికట్ట తెగినప్పుడు ప్రాజెక్టు కుడికాలువ సుమారు 290 మీటర్లు కొట్టుకు పోయింది. ఆ ప్రదేశంలో ఇప్పుడు కాలువ నిర్మాణ పనులు జరుగుతు న్నాయి.

40 శాతం కుడికాలువ పనులు పూర్తి అయ్యాయి. రెండేళ్ల వ్యవధిలో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది ప్రస్తుతం ప్రాజెక్టు పై ప్రాంతాల నుంచి భారీగా నీరు వస్తుండడంతో, ప్రాజెక్టుకు ఎటువంటి ప్రమాదం లేకుండా మరువ (అలుగు) ద్వారా నీరు నదిలోకి పోయేలా ఏర్పాట్లు చేశారు.

ఎడమ కాలువకు మరమ్మతులు చేయాలి



ఎడమ కాలువలో పిచ్చి మొక్కలు దర్శనమి స్తున్నాయి. ప్రాజెక్టు దిగువ నుంచి కాలువ మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయి ఉంది. ముడుం పాడు క్రాస్ కురవపల్లి మధ్యలో కాలువ ధ్వంసం కావడంతో నీరు వృథా అయ్యే అవకాశం ఉంది. ప్రాజెక్టు పనులతో పాటు, కాలువ పనులు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది. చివరి ఆయకట్టుకు నీరు అందుతుంది.

- చంద్రమోహన్, రైతు, కురవపల్లి

త్వరగా నీరు అందించాలి



ప్రాజెక్టు కుంగిపోవడం రైతులకు శాపంగా మారి ంది. త్వరగా కుడికాలువ మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందించాలి. నాలుగేళ్ల నుంచి సాగుకు నీరు లేక బీడు భూములు దర్శనమిస్తు న్నాయి. కుడికాలువకు నీరు అందిస్తేనే రైతుల కడుపు నిండుతుంది. సాగునీరు రాక పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా త్వరగా పనులు పూర్తి చేయాలి

- వెంకట్రమణనాయక్, రైతు, మిట్టబిడికి

రెండు నెలల్లో సాగునీరు

90 శాతం పనులు పూర్తయ్యాయి. రెండు నెలల్లో కుడి, ఎడమ కాలువలకు సాగునీరందిస్తాం. కుడికాలువ పనులు జరుగుతు న్నాయి. గేటు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు ప్రధాన గేట్లకు మరమ్మతులు చేయాల్సి ఉంది. వచ్చే సంవత్సరంలో ఆ పనులు చేస్తాం. ప్రస్తుతం ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు త్వరిత గతిన పనులు పూర్తి అయ్యేలా చూడాలని ఉన్నతాధికా రుల నుంచి ఒత్తిడి ఉంది. త్వరగా పనులు పూర్తి చేస్తాం.

- వెంకట్రామయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

రౌడీ మూమూళ్ల కోసం దాడి ..

● బాధితుడి ప్రతిదాడి ● నలుగురికి గాయాలు



గాయపడిన వారు

జమ్మలమడుగు, జూన్ 17: రౌడీ మామూళ్ల కోసం నలుగురు వ్యక్తులు చేసిన దాడి యత్నం బాధితుడి ప్రతిదాడితో విఫలమైంది. దీంతో ఇరువర్గాలకు చెందిన నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు మైలవరం మండల కేంద్రానికి చెందిన కట్టి సుబ్బరాయుడు మార్కెట్‌యార్డు మాజీ వైస్‌ఛైర్మన్. ఈయన కొన్ని సంవత్సరాలుగా మైలవరం, జమ్మలమడుగు కట్టకింద మారెమ్మగుడి సమీపాన చేపల చెరువు నిర్వహి స్తున్నాడు. ఆయనకు సోమవారం మధ్యాహ్నం మైలవరం మండలం చిన్నకొమెర్ల గ్రామానికి చెందిన తిరుపాల్‌రెడ్డి, పుల్లారెడ్డితోపాటు మైలవరానికి చెందిన చంద్ర, వర్మ కారులో వచ్చి డబ్బు డిమాండ్ చేస్తూ బెదిరించారు. సుబ్బరాయుడు తిరగబడడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుబ్బరాయుడుకు తీవ్రంగా గాయపడగా, తిరుపాల్‌రెడ్డి, పుల్లారెడ్డికి తలకు గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. చుట్టుపక్కలవారు వారించడంతో, ఇరువర్గాలు ఎవరికి వారు ప్రభుత్వ ఆస్పత్రికి తరలివెళ్లారు. సమాచారం తెలుసుకున్న జమ్మలమడుగు అర్బన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. రూ. 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో గొడవ జరిగిం దని కట్టి సుబ్బరాయుడు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ మాట్లాడుతూ డబ్బు కోసం గొడవ జరిగిందని, అన్ని కోణాల్లో విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని విలేకరులకు తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



ప్రేమ్‌సాగర్ (ఫైల్)

పోరుమామిళ్ల, జూన్ 17: ఉద్యోగం రాకపోతే తన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారు తుందన్న భయంతోపాటు, మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ యువకుడు. మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లెకు చెందిన ప్రేమ్‌సాగర్ (22) అనే యువకుడు ఉద్యోగం రాలేదని మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున సెల్‌టవర్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న అతని తండ్రి గురవయ్య, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వెళ్లి అతన్ని కాపాడే యత్నం చేశారు. అప్పటికే అతను మృతి చెందడంతో భోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. మృతుని తండ్రి గురవయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

యూటీఎస్ కుటుంబ సంక్షేమ పథకం ట్రెజరర్‌గా లక్ష్మిరాజా

కడప (ఎడ్యుకేషన్), జూన్ 17 : కుటుంబ సంక్షేమ పథకం రాష్ట్ర ట్రెజరర్‌గా యూటీ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నెల్లూరు పట్టణంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులపాటు యూటీఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో యూటీఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథకాన్ని పెట్టారని ఈ పథకానికి రాష్ట్ర ట్రెజరర్‌గా కడపజిల్లాకు చెందిన లక్ష్మిరాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేశ్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథకంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు జిల్లా ఆఫీసు బేరర్లు సభ్యులుగా ఉంటారని ఇందులో సభ్యత్వం కలిగిన ఉపాధ్యాయులు మరణించినా, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినా అనారోగ్యంపాలైన ఆర్థికంగా ఆదుకుంటామని తెలిపారు.

అనాథ చిన్నారులకు ఎమ్మెల్యే పుట్టా అండ..



అనాథ చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్ జూన్ 17 : స్థానిక పాతూరులో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హామీ ఇచ్చారు. నంద్యాల రోడ్డులోని ఈద్గా వద్ద పిల్లలతో పుట్టా సుధాకర్‌యాదవ్ మాటా డారు. వారి చదువుల విషయంతో తాను అండగా ఉంటానని తెలిపారు. వారి కుటుంబానికి ఎలాంటి సాయం అయినా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు.

పులివెందులలో చోరీ

● రూ.19లక్షల విలువైన బంగారు రూ.40వేలు నగదు అపహరణ

పులివెందుల టౌన్, జూన్ 17: పులివెందులలోని ప్రశాంతి నగర్‌కు చెందిన ఉదయగిరి అల్లాబకాష్ అనే వ్యక్తి ఇంట్లో దుండగులు రూ.19లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఉంగరాలు, రూ.40వేలు నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అల్లాబకాష్ ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి స్థానిక నగరిగుట్టలో ఉన్న తన తల్లి ఇంటికి వెళ్లాడు. 17వ తేదీన సాయంత్రం సుమారు 4గంటల సమయంలో తన ఇంటి తలుపు తెరిచి ఉన్నట్లు ఆ ఇంట్లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో అద్దెకు ఉంటున్న విష్ణువర్ధన్ అనే వ్యక్తి సమాచారం అందించడంతో అల్లాబకష్ హడావుడిగా ఇంటికి తిరిగి వచ్చి పరిశీలించగా బీరువాలోని దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతోపాటు, సుమారు 26తులాల ఆభరణాలు, రూ.40వేలు నగదు చోరీకి గురైనట్లు తెలిసింది. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల, జూన్ 17: ఎర్రగుంట్ల మండలంలోని నిడుజువ్వి, పోట్లదుర్తిలో జూదమాడుతున్న రెండు వర్గాలను ఎర్రగుంట్ల పోలీసులు అరెస్టు చేశారు. నిడుజువ్వి కేంద్రంగా సాగుతున్న జూదకేంద్రంలో 16మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.72,750 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పోట్లదుర్తిలోని జూదకేంద్రంలో 8మందిని అదుపులోకి తీసుకుని రూ.24,960లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసునమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. కాగా ఇటీవల జూదకేంద్రాల్లో భారీగా జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

కంపెనీ డబ్బులు కాజేసిన కేసులో యువకుడి అరెస్టు

మదనపల్లె అర్బన్, జూన్ 17: స్థానిక దేవతా నగర్‌లోని ఓ కంపెనీలో డబ్బులు కాజేసి పరారైన కంపెనీ అసిస్టెంట్ మేనేజరు టి. రామచంద్ర (38)ను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. తమిళ నాడు రాష్ట్రం, కరూర్ జిల్లా సెంబియనాథం గ్రామానికి చెందిన. రామచంద్ర అసిస్టెంట్ మేనేజరుగా పని చేస్తూ కలెక్షన్ బాయ్స్ తెచ్చిన కంపెనీ డబ్బులు రూ. 7లక్షలు తీసుకుని పరారయ్యాడు. ఈ సమ యంలో మేనేజరు 15 రోజులు సెలవులో ఉండడంతో కలెక్షన్ నగదు అతనికి ఇచ్చారు. ఇదే అదునుగా చూసుకుని నగదుతో అతను పరారయ్యాడు. తమిళ నాడు రాష్ట్రం, దిండుగల్లు జిల్లా చెందిన కె. కార్తీక్ (39)ఫిర్యాదు మేరకు రామచంద్రపై మే 30వ తేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితు డిన స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

త్రిశంకు స్వర్గంలో గోపాలమిత్రలు

- ప్రతిపక్ష నేతగా జగన్ హామీలు
- అధికారంలోకి వచ్చాక బెదిరింపులు
- ఐదేళ్లుగా ప్రోత్సాహకాలు నిలిపివేత
- టీడీపీ ప్రభుత్వంలో అయినా అందేనా?

సంబేపల్లె, జూన్ 17: నాలుగేళ్లుగా ప్రోత్సాహకాలు చెల్లించకపోవడంతో గోపాలమిత్రలు ఇబ్బందులు పడుతున్నారు. 2001లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకృత్రిమ గర్భధారణ ద్వారా మేలు రకం పశుజాతిని పెంపొందించాలన్న ఉద్దేశంతో గోపాలమిత్ర వ్యవస్థను తీసుకొచ్చారు. తరువాత అధికారంలోకి వచ్చిన రాజశేఖర్‌రెడ్డి ఈ వ్యవస్థను ప్రోత్సహించారు. 2018లో ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి రాగానే గోపాలమిత్రల సమస్యలన్నీ రాగానే పరిష్కరిస్తామని చిత్తూరు జిల్లాలో ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా 2018 జనవరి 13న హామీ ఇచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు నెలలు మాత్రం కృత్రిమ గర్భధారణకు ఇచ్చే ప్రోత్సాహకాలు అందించి, ఆ తర్వాత నిలిపివేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయల మేర ప్రభుత్వం బకాయి పడింది. అప్పటి నుంచి గోపాలమిత్ర వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కక్ష సాధింపులకు గురి చేశారని గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజీనామాలు చేసి ఆఫీస్ సబార్డినేటర్ విధుల్లో చేరాలంటూ పైఅధికారులు ఒత్తిడి తెచ్చినట్లు చెబుతున్నారు.

గోపాలమిత్ర వ్యవస్థ ఏర్పాటు

కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు రకపు పశు జాతిని పెంపొందించాలన్న ఉద్దేశంతో 2001లో టీడీపీ ప్రభుత్వం గోపాలమిత్ర వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇంటర్ చదివి పశువైద్యంపై ఆసక్తి కలిగిన యువకులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చింది. పశువ్యాధుల నివారణ, కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేసేందుకు గౌరవ వేతనగా రూ.1000 ఇచ్చేవారు. 2004 అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008లో గోపాలమిత్రలకు గౌరవ వేతనాన్ని రూ.1200 చేశారు. రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ గౌరవ వేతనాన్ని రూ.6500కు పెంచుతూ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవో విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 90 మంది గోపాలమిత్రలు ఉన్నారు. గోపాల మిత్రలకు గౌరవ వేతనం కూడా రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దూడల ఇన్సూరెన్స్, కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు,నగదు ప్రోత్సాహక బహుమతులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం నిలిపివేసింది. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో బకాయిలు అందుతాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు వేస్తున్న గోపాలమిత్ర

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు రంగం సిద్ధం

● భవనాన్ని ఖాళీ చేయనున్న విద్యుత్ శాఖ



పులివెందులలో అన్నక్యాంటీన్ (ఫైల్)



అన్నక్యాంటీన్ భవనంలో ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ కార్యాలయం

పులివెందుల రూరల్, జూన్ 17: తక్కువ ధరతో అల్పాహారం, భోజనం అందించే బృహత్తర లక్ష్యంతో నాటి తెలుగుదేశం ప్రభుత్వం పులివెందులలోని గాంధీ సర్కిల్‌లో రూ.36 లక్షల వ్యయంతో 2018 అక్టోబరు 2న అన్న క్యాంటీన్ ప్రారంభించింది. అన్నక్యాంటీన్‌లో రూ.5 అల్పాహారం, భోజనం అందిస్తుండడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పట్టణానికి వచ్చిన సామాన్య, మధ్యతరగతి, పేదలకు అన్నక్యాంటీన్ ఉపయోగకరంగా ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్నక్యాంటీన్లను మూసేసి, అన్నక్యాంటీన్ ముందు బస్‌షెల్టర్ ఏర్పాటు చేసింది. ఈ ఏడాది మార్చి నెలలో అన్న కాంటీన్ భవనంలో ఏపీఎస్పీడీసీఎల్ సబ్ డివిజన్ అధికారి కార్యాలయంఏర్పాటు చేశారు. మరో గదిని నిర్మించి, వెనుక కాంపౌండ్‌వాల్ నిర్మించారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ అన్నక్యాంటీన్ తెరపైకి వచ్చింది. అన్న క్యాంటీన్లు పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనితో అన్న క్యాంటీన్ భవనాన్ని ఖాళీ చేయా లని విద్యుత్ శాఖ ఉత్తర్వులు అందినట్లు సమాచారం. ఈ విషయమై ఏపీఎస్పీడీసీఎల్ పులివెందుల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులును వివరణ అడగ్గా, వచ్చే నెల 1వ తేదీకల్లా ఖాళీ చేయాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. దీంతో కార్యాలయాన్ని మినీ సెక్రటేరియట్ వద్దకు మార్చనున్నట్లు తెలిపారు.

కూటమి నేతలు, 'యువగళం'తోనే ఘనవిజయం

● చమర్తి జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, జూన్ 17: ఎన్డీఏ అగ్రనేతలతో పాటు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌బాబు యువగళం పాదయాత్రతోనే ఈ ఘనవిజయాన్ని సాధ్యమైందని తెలుగుదేశం పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సోమవారం వీరబల్లి మండల కేంద్రంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడానే. అరాచక జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు నాడు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌బాబు యువగళం పాదయాత్ర చేపట్టి యువతను ఎన్డీఏ కూటమి వైపు ఆకర్షితులు అయ్యేలా చేశారన్నారు. యువగళం పాదయాత్రకు అడుగడుగునా జగన్ ప్రభుత్వం ఆటంకాలు కలిగిస్తూ విఫలం చేసేందుకు కొందరు పోలీసు అధికారులను ఉసికొల్పి అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. యువగళం పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయే ఒక మహత్తర ఘట్టమని ఆయన ప్రశంసించారు. దీంతో స్పందించి జనసేన, బీజేపీలు సంపూర్ణంగా మద్దతు ఇచ్చి జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించినట్లు ఆయన తెలిపారు. ఈ ఘన విజయంలో బీజేపీ అగ్రనేతలతో పాటు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కూడా ప్రధాన భూమిక పోషించినట్లు ఆయన గుర్తు చేశారు. వీరి కలయికతోనే రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏ కూటమికి అత్యధిక మెజార్టీ వచ్చిందన్నారు. ఈయన వెంట తెలుగుదేశం పార్టీ వీరబల్లి మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షుడు ఆంజనేయులురెడ్డి, ప్రసాద్‌రాజు, వీరామృతనాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, నాయకులు యర్రపురెడ్డి రాంమోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, జయుడు, నందకుమార్‌నాయుడు, మదనపల్లె సుధాకర్, నాగప్పనాయుడు, శివ, ఫయాజ్, నాగమ్మ, తెలుగుదేశం పార్టీ ఎన్ఆర్ఐ నాయకులు నరసింహనాయుడు, తెలుగు యువత నాయకులు సాయికుమార్‌రాజు, వినయ్, రమణ, రాంమోహన్, మంజునాద, మహేశ్, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జగన్‌మోహన్‌రాజు

కుమార్తెను తీసుకెళ్లాడని దాడి

మదనపల్లె టౌన్, జూన్ 17: ప్రేమ పేరుతో తమ కుమార్తెను తీసుకెళ్లాడనే ఆగ్రహంతో ఓ యువకుడి కుటుంబంపై దాడి చేశారు. కురబలకోట మండల తెట్టు హరిజనవాడకు చెందిన వీరభద్ర(50), బయ మ్మ (45) కుమారుడు బాలరాజు(25) ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగాపోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల బాలరాజు ఆ అమ్మాయిని తీసుకెళ్లిపోయాడు. దీంతో ఆగ్రహించిన అమ్మాయి తరుపు వారు బాలరాజు తండ్రి వీరభద్ర, తల్లి బయమ్మ, అమ్మమ్మ వెంకటమ్మపై దాడి చేయగా, వారు మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈమేరకు అవుట్ పోస్టు పోలీసులు ముదివేడు స్టేషన్‌కు సమాచారం అందించారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

● సర్వత్రా పండుగ సంబరాలు ● ఆత్మీయ పలకరింపులు.. ఆలింగనాలతో సందడి చేసిన ముస్లింలు



కడప (కల్చరల్), జూన్ 17: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మత గురువులు పేర్కొన్నారు. సోమవారం ముస్లింలు ఈ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కడప నగరం బిల్టప్ వద్ద గల ఈద్గాలో మత గురువు న్యాయమతుల్లా బక్రీద్ దైవసందేశాన్ని ఇచ్చారు. పెద్ద దర్గా పీఠాధిపతి ఆపుల్లాహుసేని బక్రీద్ నమాజ్ చేయించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి, అమీర్‌బాబు, అఫ్జల్‌ఖాన్, సుభాన్‌బాష, జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు. షరీఫ్ తనసిబ్బంతో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దండు ఈద్గాలో, నగర దండు సమీపంలో వెలసిన చారిత్రాత్మక మురాదియా షాహి ఈద్గాలో ఉదయం 10-45 నిమిషాలకు ఈద్-ఉల్-జుహ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురాదియ షాహి ఈద్గా వారసుడు ముత వల్లి సయ్యద్ షా మొహమ్మద్ జమాలుల్లా బాషా సాహెబ్, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీఠాధిపతి సోదరుడు సయ్యద్‌షా మొహమ్మద్ ఆజ్మల్ పీరాసాహెబ్‌మురాది బక్రీద్ పర్వదిన సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో పలువురు రాజకీయనాయకులు, ముస్లిం ప్రముఖులు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో...మండలంలో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. సోమవారం ఉదయాన్నే ఈద్గాలు, మసీదుల వద్దకెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని అనిమెల, గంగిరెడ్డిపల్లె, యు.రాజుపాలెం, నేల తిమ్మాయపల్లె, వీఎన్‌పల్లె, ఎన్.పాలగిరి తదితర గ్రామాలలో ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకున్నారు. మతపెద్దలు మాట్లాడుతూ త్యాగనరతిని వ్యాపించడమే బక్రీద్ పం డుగ ముఖ్య ఉద్దేశమని, అన్ని గుణాల కన్నా దాన గుణమే ఉత్త మం అదే పండుగ సారాంశమని తెలియజేశారు. బంధువులు, స్నే హితులను ఇంటికి పిలిపించి విందును ఏర్పాటుచేశారు.

సింహాద్రిపురంలో...సింహాద్రిపురంలో ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ముల్లా వలి, మహమ్మద్ రఫీ, ముల్లా నాగూర్ త్యాగనిరతికి, ధర్మబద్ధతకి, దాతృత్వానికి బక్రీదు పండుగ ప్రతీకగా నిలుస్తుందని ప్రబోధించారు.

సీకేదిన్నెలో... బక్రీదు పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. బక్రీదు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బక్రీ దు ఆవశ్యకతను మత గురువులు వివరించారు. మండలంలోని వివిధ ఈద్గాలలో బక్రీదు పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.



వేంపల్లెలో...



కడప నగరంలో బక్రీదు సందేశాన్నిస్తున్న మతగురువు

ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం మతపెద్దలు, ప్రముఖులు



బక్రీదు సంబరాల్లో అమీర్‌బాబు, శ్రీనివాసరెడ్డి



దండు మురాదియ ఈద్గాలో దైవసందేశం ఇస్తున్న పీఠాధిపతి అక్మల్‌పీరా





సింహాద్రిపురం, వీఎన్‌పల్లెలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భగవంతుడు కోరిన దాన్ని మనస్ఫూర్తిగా సమర్పించడమే త్యాగం

చెన్నూరు, జూన్ 17 : త్యాగం అంటే భగవంతుడు కోరిన దాన్ని మనస్ఫూర్తిగా సమర్పించి ఆయన అనుగ్రహానికి పాత్రులు కావడమేనని, అలాంటి త్యాగానికి ప్రతీక బక్రీదు పండుగ అని చెన్నూరు ఖిల్లా మసీదు మత గురువు రఫిక్ అన్నారు. బక్రీదు పండుగను పురస్కరించుకుని చెన్నూరు ఖిల్లా మసీదులో గురువు రఫిక్ షాహీ మసీదులో గురువు సలీం మహ్మద్ బక్రీదు విశిష్టతను ముస్లింలకు వివరించారు. ఖిల్లా మసీదు గురువు మాట్లాడుతూ అల్లాహ్ విశ్వం అంతా వ్యాపించి ఉన్న మహాత్ముడని, ఆయన లీలలు ఆయన ప్రపంచానికి ఇచ్చిన ఆశీస్సులు, బోధనలు ఎంతో గొప్పవన్నారు. ప్రతి మనిషి తన జీవితంలో భగవంతుని అనుగ్రహం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడాలన్నా రు. ఆ త్యాగం స్వార్థపూరితంకానిదిగా ఉండాలన్నారు. అలా అ ల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన వారిలో అబ్రహాం, ఇస్మాయిల్ ఎంతో గొప్పవారన్నారు. అల్లాహ్ పట్ల ఉన్న విశ్వాసాన్ని చాటుకోవడానికి కన్నబిడ్డ అయిన ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధపడటం, తండ్రి మాటకు కట్టుబడి అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులు కావడానికి సిద్ధపడే ఇస్మాయిల్ ఇద్దరూ గొప్పవారేనని, వారికి భగవంతుని పట్ల ఎంతటి విశ్వాసం, న మ్మ కం ఉంటుందో భగవంతుడు కూడా అంతే విశ్వాసం చూపిస్తాడన్నారు. అదే కరుణామయుడైన అల్లా ఇచ్చిన గొప్ప సందేశమన్నారు. అల్లా తన భక్తులను ఎప్పుడూ శిక్షించడని, రక్షించడమే ఆయన కర్తవ్యమన్నారు. కాబట్టి మానవ జీవితంలో ప్రతి ముస్లిం కుటుంబం అల్లాహ్ అనుగ్రహం కోసం ని త్యం ప్రార్థన చేస్తూనే ఉండాలన్నారు. చేసే ప్రార్థన నిస్వార్థంగా ఉండాలని అది తన కోసం కాకుండా తన చుట్టూ ఉన్న సమాజం కోసం ఉండాలన్నారు. అలాంటప్పుడే అల్లా కరుణ వారిపై ఉంటుందన్నారు. అలాగే బక్రీదు పండుగ సందర్భంగా ఖిల్లా షాహీ మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అంతేకాక కొండపేట, రామనపల్లె, ముండ్లపల్లె, నజీర్‌బేగ్‌పల్లె త దితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

నూతన భవనాలలోకి ప్రభుత్వాసుపత్రి

● సామగ్రి తరలింపు ప్రక్రియ వేగవంతం
● రోగులకు ఇబ్బంది లేకుండా సేవలు ● సూపరింటెండెంట్ మల్లీశ్వరి

పులివెందుల రూరల్, జూన్ 17: పులివెందులలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోకి ఏరియా ఆసుపత్రి తరలింపు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఇప్పటికే పలుమార్లు ఆసుపత్రి తరలింపు ప్రక్రియ వాయిదా పడింది. ఎట్టకేలకు అధికారుల ఆదేశాలతో సామగ్రిని తరలిస్తున్నారు.పులివెందులలో మెడికల్ కళాశాల నిర్మితమవుతున్నందున ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని నిర్మించారు.

ఈ ఏడాది మార్చిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐపీ, ఓపీ, అత్యవసర విభాగాలతో కూడిన భవనసముదాయాలను ప్రారంభించారు. నూతన ఆసుపత్రిలోకి ఏరియా ఆసుపత్రిని తరలించాల్సి ఉండగా పలుమార్లు వాయిదా పడింది. రెండ్రోజుల్లో తరలింపు ప్రక్రియ పూర్తి కావాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది.

ప్రజల కోసం కొద్దిరోజులు ఇక్కడే వైద్యసేవలు : సూపరింటెండెంట్

ఒక్కసారిగా ఆసుపత్రిని తరలించడంవల్ల ప్రజలు ఇబ్బందులు పడతారని సూపరింటెండెంట్ మల్లీశ్వరి తెలిపారు. క్యాజువాలిటీ, గర్భిణులు, చిన్నపిల్లలకు, సాధారణ ఓపీ పాత ఆసుపత్రిలోనే నిర్వహిస్తామన్నారు. అత్యవసర వైద్యసేవలకై పాత ఆసుపత్రికి వచ్చే రోగులను నూతన ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నామన్నారు. రోగులకు ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందుతాయని, మెడికల్ కళాశాలకు సంబంధించిన నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్‌ఎమ్‌సీ) బృందం సందర్శన అనంతరం పూర్తిస్థాయిలో నూతన ఆసుపత్రికి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.



ఏరియా ఆసుపత్రిలోని సామగ్రిని తరలిస్తున్న దృశ్యం

మీసేవ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 17 : మీసేవ ఆపరేటర్లు సమస్యలు పరిష్కరించాలని మీసేవ జిల్లా కోఆర్డినేటరు రమేశ్ కోరారు. సోమవారం కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లాఅధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిని కలిశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మీసేవల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని, కుటుంబాలు గడవక ఆపరేటర్లు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఇప్పటికైనా ప్రతి సర్వీసులను మీ సేవ ద్వారా జరిగేలా చూడాలని, అంతేకాకుండా రెవెన్యూ డిపార్ట్‌మెంటుకు మీ సేవలను అనుసంధానం చేస్తే బాగుంటుందని ఆ విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పం దించారు. అలాగే ట్రాన్స్‌పోర్టు మినిస్టరుగా బాధ్యతలు తీసుకున్న మందిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని కూడా కలిసి మీసేవ ఉద్యోగుల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసేవ మేనేజర్లు కరీముల్లా, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాధవీని కలిసిన మీసేవ ఆపరేటర్లు

నగర సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యే మాధవీకి అభ్యుదయ వేదిక వినతి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 17 : కడప నగరంలో సమస్యలు పరిష్కరించాలని అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు కె.సురేష్‌బాబు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, శంకరయ్య కోరారు. సోమవా రం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మె ల్యే మాధవీకి కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప నగరంలో నెలకొన్న పలు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. భవిష్యత్తులో కడపనగరాన్ని మంచి ప్రగతి పథంలో నిలపాలని విజ్ఞప్తి చేశారు. మాధవి స్పందిస్తూ అభివృద్ధికి రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ప్రణాళికాబద్ధంగా తన వంతు కృషి చేసి నగరాన్ని ప్రగతిపథంలో నిలుపుతానని సూచించారు. అలాగే అందరి సహాయ సహకారాలు తీసుకుని అందరినీ కలుపుకుని ముందుకు వెళతామన్నారు. అభ్యుదయ వేదికసభ్యులు మహబూబ్‌బాషా, హైదర్‌అలీ, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

కడప (ఎన్టీఆర్ సర్కిల్) జూన్ 17 : కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పుట్టిన రోజును పురస్కరించకుని పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం వల్లూరు మండలంలోని పైడికాల్వలో ప్రత్యేక కంటివైద్య రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు శిబిరం నిర్వాహకులు కల్లూరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రత్యేక కంటి పరీక్షలు శస్త్రచికిత్సలు అవసరమైన వారికి పుష్పగిరి ఆసుపత్రిలో ఉచితంగా చేస్తారన్నారు. శుక్లాలకు ఆధునిక ఆపరేషన్ మెల్లకన్ను ఆపరేషన్, రెటీనా, కార్నియా, గ్లూకోమా, కొయ్యకుండా కంటి ప్లాస్టిక్ సర్జరీ, కటి నరాల చికిత్స తదితర సదుపాయలు పుష్పగిరి కంటి ఆసుపత్రి నందు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. అన్ని వయసుగల వారు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించానలి కోరారు. కంటి శుక్లాలు గుర్తించిన వారికి కంటి ఆపరేషన్ చేస్తారని వివరించారు. ఆపరేషన్‌కు సిద్దపడిన వారిని అదే రోజు ఆసుపత్రికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఆరోగ్య శిబిరానికి వచ్చేవారు ఆరోగ్యశ్రీకార్డు, ఆధార్‌కార్డు తీసుకురావాలని వివరించారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్న సద్వినియోగం చేసుకోవాలిని సూచించారు.

మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన ఎన్జీఓ నేతలు

కడప(కలెక్టరేట్), జూన్ 17: రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖా మత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవి కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి సోమవారం రాయచోటిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్జీఓ నేతలు, ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు సకాలంలో అందించాలన్నారు. ఎన్జీఓ సంఘ ట్రెజరర్ నిత్యపూజయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నరసింహారెడ్డి, రాజశేఖర్, దేవేంద్ర, మహదేవ్, గణేష్ యాదవ్, అల్లీ బాష, కె. చిన్నయ్య, శైలేశ్వరరెడ్డి, పద్మనాభరావు, బలరామరాజు, విశ్వనాథం మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎన్జీఓ నేతలు

'అక్రమాలపై న్యాయ విచారణ చేపట్టాలి'

కడప (మారుతీనగర్), జూన్ 17: ఆర్సీఎం ఎయిడెడ్ పాఠశాలల్లో గత 25 సంవత్సరాలుగా తక్కువ జీతాలతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వకుండా బిషప్ అన్యాయం చేస్తున్నారని, వెంటనే అక్రమాలపై న్యాయ విచారణ చేపట్టాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి, యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు డిమాండ్ చేశారు. తక్షణమే బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. సోమవారం స్థానిక మరియాపురం చర్చి నుంచి బిషప్ హౌస్ వరకు ర్యాలీ నిర్వహించి తదుపరి ఆందోళన చేపట్టి మాట్లాడారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. వినోద్‌కుమార్, బాధిత ఉపాధ్యాయులు కవిత, ప్రమీలారాణి, శేఖర్, ప్రమీల, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు.. చిలకమర్తి లక్ష్మీనరసింహ



రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువాతో సన్మానం చేసి అభినందిస్తున్న పెంచల కోన బలిజ, కాపు అన్నదాన సత్రం ఛైర్మన్ కోనేటి మురళీకృష్ణ, తిరుమల ఆస్పత్రి ఇన్‌చార్జి నాయుడు రాజశేఖర్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 17 : కవి, రచయిత, నాటకకర్త పాత్రికేయుడు, సంఘ సంస్కర్త, విద్యావేత్త అయిన చిలకమర్తి లక్ష్మీనరసింహ అఖండమైన కీర్తి తెచ్చి చిరస్మరనీయుడని చేసింది ఆయన రాసిన గయోపాఖ్యాన నాటకమేనని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లిఖారుజన రెడ్డి తెలిపారు, సోమవారం కడప నగరం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో చిలకమర్తి 78వ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ చిలకమర్తి 22 సంవత్సరాల వయసులో రాసిన గయోపాఖ్యానం ప్రతులు అప్పట్లోనే లక్షకు పైగా అమ్ముడుపోవడ విశేషమన్నారు. మధురకవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి ప్రసంగిస్తూ ఆంధ్ర మిలటన్‌గా ప్రసిద్ధి చెందిన చిలకమర్తి ఆ కాలంలోనే దళితులకు ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. డాక్టర్ పాలెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఆయన ఎన్ని కథలు, నవలలు, నాటకాలు అనవదాలు రాసినా గయోపాక్యానమే మంచి కీర్తి తెచ్చిందన్నారు. సత్యనారాయణ చిలకమర్తి ఆసుబుగా చెప్పిన పద్యాలను చక్కగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆమూరు విశ్వనాథరెడ్డి, భూమిరెడ్డి పోలిరెడ్డి, సురభి రామచంద్రయ్య కర్నాటి నరసింహారెడ్డి, పట్నం సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



చిలకమర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లిఖార్జునరెడ్డి తదితరులు

అంధ విద్యార్థినికి ఆర్థికసాయం

పులివెందుల టౌన్, జూన్ 17: రోటరీపురానికి చెందిన వల్లెపు రోజా అనే అంధ విద్యార్థినికి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ వల్లెపు రోజాకు తల్లదండ్రులు లేకపోవడతో నాయణమ్మ సంరక్షణలో జీవిస్తోందన్నారు.

డిగ్రీ పూర్తిచేసిన రోజా ఇటీవల ఎడ్‌సెట్ ప్రవేశపరీక్ష రాసి ఎర్రగుంట్ల బీఈడీ కళాశాలలో అడ్మిషన్ కావడం జరిగిందన్నారు. కోర్సు ఫీజు ప్రతి సెమిస్టర్‌కు రూ.10వేల చొప్పున రూ.40వేలు చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఆమె పరిస్థితిని పులివెందులలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సోమశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తన వంతుగా రూ.10వేలు ఇచ్చారన్నారు.



రోజాకు ఆర్థికసాయం అందిస్తున్న సోమశేఖర్‌రెడ్డి



రిమ్స్ సమీపంలోని ఈద్గాలో నమాజు అనంతరం కడప ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం జమాత్ పెద్ద ముస్తి రహీముల్లాతో చర్చిస్తున్న కడప పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



బక్రీదు సందర్భంగా దండు ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎండీహెచ్ కుటుంబ సభ్యులు ఎస్ఎండీ నవీద్, అయాన్, షేక్ మహ్మద్ బాషా, ముంతసిర్

ఆశాలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నెరవేర్చాలి : ఏఐటీయూసీ

కడప (మారుతీనగర్), జూన్ 17: ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెరవేర్చేదిశగా పావులు కదపాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుభాషిణి, శాంతి, కోరారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్వచ్ఛంద సేవకులుగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనంతో పాటుగా ఉద్యోగ భద్రత, కల్పించాలన్నారు. మెటర్నిటీ, సాధారణ సెలవులు, ఇవ్వాలన్నారు. కార్మికులుగా గుర్తించి అక్రమ బదిలీలను ఆపాలన్నారు. అంతేకాకుండా ఆశాలకు రికార్డులతో పాటుగా గ్రాడ్యుటీ కూడా ఇవ్వాలన్నారు., కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

పులివెందుల రూరల్, జూన్ 17: పులివెందులలోని శిల్పారామం, ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఏర్పాటుచేసిన నృత్య ప్రదర్శనలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. సోమవారం బక్రీద్ సందర్భంగా నృత్య ప్రదర్శన కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో మదనపల్లెకు చెందిన సూర్యడ్యాన్స్ అకాడమీ బృందం, కడపకు చెందిన కిషోర్ డ్యాన్స్ అకాడమీ బృందాలు శాస్త్రీయ,జానపద, సినిమా పాటలకు నృత్యం చేశారు. అలాగే పద్మవ్యూహంలో చక్రధారి సినిమా హీరో ప్రవీణ్‌రాజ్‌కుమార్, హీరోయిన్ శశిక, డైరెక్టర్ సంజయ్‌రెడ్డిలు హాజరయ్యారు. వీరు కాసేపు తమ సినిమా మాటలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసిన సందర్శకులకు ఏఓ సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.



శిల్పారామంలో నృత్యం చేస్తున్న సూర్య, కిషోర్ డ్యాన్స్ అకాడమీ బృందం



ఉపాధ్యాయ యూనియన్‌కు విరాళం



ఎస్టీయూ సభ్యులకు విరాళం అందిస్తున్న వైఎస్ వెంకటరెడ్డి

పులివెందుల టౌన్, జూన్ 17: ఎస్టీయూ ఉపాధ్యాయ యూనియన్‌కు వైఎస్ వెంకటరెడ్డి రూ.20వేల విరాళం అందించారు. సోమవారం పులివెందుల పట్టణంలోని తులసి ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో ఎస్టీయూ యూనియన్ సభ్యులకు వెంకటరెడ్డి విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచీ చెడులను విద్యార్థి దశ నుంచి వివరించే ఉపాధ్యాయులకు విరాళాన్ని ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు గురువుల సూచనలు, సలహాలను తప్పక పాటించాలని, తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాదా పీర, కృష్ణ, దుష్యంత్‌నాథ్‌రెడ్డి, కైలాసనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు స్వేచ్ఛ, సమానత్వం కల్పించాలి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

జమ్మలమడుగు, జూన్ 17: దళితులకు స్వేచ్ఛ, సమానత్వం కల్పించాలని పాత బస్టాండులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు రామాజీ ఇమ్మానుయేల్ ఆ కమిటీ వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై జస్టిస్ పున్నయ్య ఇచ్చిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని, దళితులకు స్వేచ్ఛా సమానత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి దళిత వాడలలో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. జమ్మలమడుగు పట్టణంలోని ప్రధాన హోటళ్లలో అపరిశుభ్రతతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఇటీవల తనిఖీకి వచ్చిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత మళ్లీ దాడులు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

● **నూతన కమిటీ ఎన్నిక..:** రాష్ట్ర మాలమహానాడు జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగినట్లు వారు తెలిపారు. జిల్లా నూతన కమిటీ జిల్లా మాలమహానాడు ఉపాధ్యక్షుడుగా సంగటి పుల్లయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల ఓబులేసు ఎన్నుకున్నట్లు రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్మానుయేల్ తెలిపారు.

మంత్రిని కలిసిన నేతలు



పోరుమామిళ్ల, జూన్ 17 : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి శివశంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఆయన బద్వేలు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నివాసగృహానికి విచ్చేయగా ఆయనను యువనేత రితీష్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగనపల్లె రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ఘన సన్మానం



బ్రహ్మంగారిమఠం, జూన్ 17 : మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను సోమవారం ప్రొద్దుటూరు టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ నేతలు తిప్పన జయరాంనాయుడు, ప్రముఖ న్యాయవాది పట్టాభినాయుడు, రాజశేఖర్, ధర్మానాయుడు, వీర ప్రతాప్‌గాంధి, వంకర నాగేశ్, నాగరాజు ఘనంగా ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట బ్రహ్మంగారిమఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, టీడీపీ నేతలు ఉన్నారు.

భట్ర కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బ్రహ్మంగారిమఠం, జూన్ 17 : రాష్ట్రంలోని భట్ర కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ వచ్చే విధంగా తమ సహ కారం అందించాలని సోమవారం మైదుకూరు నియోజకవర్గం శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్‌కు కొండా నారాయణ, కొండా ఓబయ్య వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో మాట్లాడుతూ రాష్ట్రంలో భట్ర కులస్తులు 90 శాతం మంది టీడీపీలోనే కొనసాగుతున్నారని అంతేకాకుండా వారికి ప్రత్యేక కార్పొరేషన్ వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో రాజకీయ పదవులు కూడా కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మందగిరి రంగయ్య, టీడీపీ నేతలు ఉన్నారు.

కడప పేరు మార్చడం దారుణం

అట్లూరు, జూన్ 17 : రాయలసీమ అంటే కడప గుర్తు కొస్తుందని అలాంటి పేరును వైఎస్ఆర్‌గా మార్చడం చాలా బాధాకరమని కడప తెలుగు పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు పాలకొల్లు సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప అని పేరు వినగానే ఒక ధైర్యం ఒక నమ్మకం, అది ఒక తెలియని అనుభూతి ఆప్యాయత, అది ఒక రాయలసీమ మర్యాదగా భావిస్తామన్నారు. వైఎస్ఆర్‌జిల్లాను కడప జిల్లాగా పునరుద్ధరించాలని కోరారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



అట్లూరు, జూన్ 17 : మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో పోలేరమ్మ, పోతురాజు జాతరలో భాగంగా సోమవారం ఎద్దుల బండలాగుడు పోటీలు ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. బండలాగుడు పోటీల్లో ఆరు జతల ఎద్దులు బండలాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు ఆలయంలో రెడ్డిపల్లె గ్రామస్థులు, కమిటీ సభ్యులు బహుమతులు అందించారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



బ్రహ్మంగారిమఠం, జూన్ 17 :మండల కేంద్రంలోని మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానం ప్రాంగణం నుంచి భక్తిశ్రద్ధలతో సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యులు కాషాయపు దుస్తులతో, జెండాలతో నగర సంకీర్తన చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దేశంలోని ప్రజలందరూ రైతన్నలు పాడి పంటలతో కళకళలాడుతూ ఉండాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం స్థానిక శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఎర్రగుంట్ల, జూన్ 17: బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం వలసపల్లెరోడ్డులోని ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ముద్దనూరు రోడ్డులోని జామియా మసీదు, ఇతర మసీదుల్లో కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ప్రార్థనలు

రాజుపాలెం..: మండల పరిధిలోని టంగుటూరు, తొండలదిన్నె మధ్యలో ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని కొరపాడు, గోపాయపల్లె గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కాశినాయన..: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. సోమవారం నర్సాపురం,గంగనపల్లె, గొంటువారి పల్లె, అంబవరం, చెన్నవరం, వరికుంట్ల తదితర గ్రామాల్లో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు.

కొండాపురం..: మండలంలో బక్రీద్ పండుగను సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.కొండాపురం,దత్తాపురం, తాళ్లప్రొద్దుటూరు తదితర గ్రామాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమీపంలోని ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజు నిర్వహించారు.

మైదుకూరు..బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం మైదుకూరులోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. పట్టణంలోని ముస్లింలు అందరూ ఈద్గా వద్దకు చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పుట్టా సుధాకర్ యాదవ్‌ను మత గురువులు సన్మానించడంతో అందరికీ ఆయనకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.





బద్వేలు, జమ్మలమడుగులో బక్రీద్ సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పోరుమామిళ్ల..: పోరుమామిళ్ల,రంగసముద్రం పంచాయతీలో ముస్లింలు మహబూబ్ నగర్ కాలనీల్లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే టేకూరుపేట, రజాసాహెబపేటలో వేడుకలు జరుపుకున్నారు.

బద్వేలు రూరల్..: త్యాగానికి ప్రతీక బక్రీదు పర్వదినమని ముస్లిం మత పెద్దలు తెలిపారు. సోమవారం సిద్దవటం రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దాన ధర్మాలు చేయాలని మత పెద్దలు సూచించారు.

జమ్మలమడుగు..: ప్రవక్త ఇబ్రహీం త్యాగానికి ప్రతీక బక్రీదు పండుగ అని జమ్మలమడుగు గౌషియా మకాన్ పీఠాధిపతి, ప్రభుత్వ ఖ్వాజీ గౌస్‌పీరా ఖాద్రి తెలిపారు. సోమవారం జమ్మలమడుగులో బక్రీదు పండుగ పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గాలలో ముస్లింలు నమాజ్ చదివారు. అలాగే జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా షాదిక్‌పాషా ఖాద్రీ పట్టణంలోని పెన్నానది ఒడ్డున షాహీ ఈద్గా మైదానంలో బక్రీదు పండుగ ప్రార్థన నిర్వహించారు.

ప్రొద్దుటూరు టౌన్..: ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమని ఇమామ్ మేరాజ్ రజా పేర్కొన్నారు. బక్రీదు పర్వదినం సందర్భంగా ముస్లింలు సోమవారం కొర్రపాడు రోడ్డులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఖాజీ ఇన్యాయతుల్లా, ఇలియాస్‌ఖురేషి, ఉపాధ్యక్షుడు ఇలియాష్, కోశాధికారి బాష, మత పెద్దలు పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ముస్లింలు సోమవారం బక్రీదు పండుగను ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లోకి వెళ్లి ప్రార్థనలు జరిపారు.చాపాడు, అన్నవరం, తిమ్మాయపల్లె, అల్లాడుపల్లె, వెదురూరు, రాజుపాళెంల్లో పండుగను సంతోషంగా జరుపుకున్నారు.

ఖాజీపేట..: బక్రీదును పురస్కరించుకుని సరస్‌ఖాన్‌పేట ముస్లింలు, అగ్రహారం నత్తడ్‌షావలి మైదానంలో, ఖాజీపేట ముస్లింలు టీచర్స్ కాలనీలోని ఈద్గామైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం విందు భోజనాల్లో హిందూ ముస్లింలు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఎర్రగుంట్లలో..



రాజుపాలెంలో..



కాశినాయనలో..



కొండాపురంలో...



చాపాడులో..



ప్రొద్దుటూరులో..



పోరుమామిళ్లలో..

మైదుకూరులో పుట్టా సుధాకర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం



కూలడానికి సిద్ధంగా ప్రభుత్వ కార్యాలయాలు

● చిన్నపాటి వర్షానికి ఉరుస్తున్న గదులు



దెబ్బతిన్న సహకార సొసైటీ కార్యాలయం

చాపాడు, జూన్ 17: మండల కేంద్రమైన చాపాడులోని పలు ప్రభుత్వ కార్యాలయాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి గదులు ఉరుస్తున్నాయి. అల్లాడుపల్లె రైతు సహకార సొసైటీ కార్యాలయాన్ని 30 ఏళ్ల క్రితం నిర్మించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని 23 ఏళ్ల క్రితం నిర్మించారు. కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడి నాశిరకంగా నిర్మించారు. దీంతో ఆ భవనాలు తక్కువ కాలంలోనే దెబ్బతిన్నాయి. గోడలు నెర్రలు చీలాయి. పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. ఈ రెండు కార్యాలయాల్లో వర్షానికి గోడలు, పైకప్పులు ఉరుస్తున్నాయి. దీంతో సిబ్బంది ఎప్పుడు పడిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. సహకార సొసైటీలో రైతులకు రుణాలు ఇచ్చిన ఫైళ్లు ఉన్నాయి. వీటిని భద్రంగా ఉంచాలంటే సౌకర్యం లేదు. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు, రైతులు, వృద్ధులు వారి అవసరాల కోసం ఈ కార్యాలయాలకు వస్తుంటారు. రికార్డులు, ఫైళ్లు భద్రంగా నిలువ చేసేందుకు తగిన సౌకర్యాలు లేవని అధికారులు పేర్కొన్నారు. గతంలో అధికారులు పలుమార్లు ఈ భవనాలకు మరమ్మతులు పనులు చేయాలని జిల్లా అధికారులకు గతంలో ఉన్న ఎమ్మెల్యేల దృష్టికి తీసుకుపోయారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. సహకార సొసైటీ కార్యాలయం పనికిరాకుండాపోయింది. దీన్ని పడగొట్టి కొత్తగా కార్యాలయాన్ని నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వం కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఈ కార్యాలయాల్లో అధికారులకు సౌకర్యాలు లేవు. వర్షంనీరు గదుల్లో ఉరుస్తున్నది. సహకార సొసైటీల్లో ఫైళ్లు తడిసిపోయే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు, మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కానీ నిధులు మంజూరు చేయించి ఈ కార్యాలయాల్లో అభివృద్ధి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

● **సెలవులో వెళ్లిన తహసీల్దారు..:** చాపాడు తహసీల్దారు భూషణం ఆదివారం నుంచి నెల రోజులపాటు సెలవులో వెళ్లినట్లు అధికారులు తెలిపారు. దువ్వూరు తహసీల్దారు ఉమారాణిని అధికారులు చాపాడు ఇన్‌చార్జి తహసీల్దారుగా నియమించారు. ఎన్నికల ముందు భూషణం అనంతపురం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.





సొసైటీలో పెచ్చులూడుతున్న దృశ్యం, ఉరుస్తున్న గోడలు



ఎంపీడీవో కార్యాలయం నెర్రెలు చీలిన దృశ్యం

కోవర్టులు నీతి వాక్యాలు చెప్పడం సరికాదు : టీడీపీ నేతలు

పోరుమామిళ్ల, జూన్ 17 : తెలుగుదేశంపార్టీలోనే ఉంటూ పార్టీకి నష్టం చేకూర్చే విధంగా కోవర్టులుగా పనిచేసిన వారు ప్రస్తుతం నీతి వాక్యాలు వల్లె వేస్తున్నారని అది సమంజసం కాదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వైసీపీతో లాలూచీ రాజకీయాలు చేసి కూడా మరలా టీడీపీకి ఓట్లు వేశామని అబద్ధాలు చెబుతున్న వీళ్ల నీతి మంతులా అని ప్రశ్నించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కనీసం ఓటు కూడా వేయని వెంకటరెడ్డి చెన్నకేశంపల్లెలో టీడీపీ, బీజేపీలకు మెజార్టీ విషయం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇలా విష ప్రచారం చేయడం కరెక్టు కాదన్నారు. టీడీపీకి పనిచేయకపోగా ముఖ్యమంత్రి, మంత్రులను బొకేలతో కలవడం సిగ్గుచేటన్నారు అని కాశినాయన మండల నాయకులు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మురుకుంటి గుర్విరెడ్డి, బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, నరసాపురం సర్పంచ్ చిన్నఖాజావలి, మండల తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రరెడ్డి, లక్కిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మురుకుటి విజయకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి, దిన్నెపు క్రిష్ణారెడ్డి, ఇతర కాశినాయన మండల టీడీపీ నాయకులు మాట్లాడారు.

నేడు అత్యవసర కౌన్సిల్ సమావేశం

జమ్మలమడుగు, జూన్ 17: జమ్మలమడుగు నగర పంచాయతీ అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు సభాభవనంలో కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు అందరు హాజరుకావాలని ఆయన కోరారు.

జలమా..గరళమా..?

పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్లు ● నాణ్యతకు తిలోదకాలు ● పట్టించుకోని అధికారులు

పోరుమామిళ్ల, జూన్ 17 : వాటర్‌క్యాన్లు, వాటర్‌ప్లాంటు లేని కాలంలో మట్టికుండలు, బానలలో స్వచ్ఛమైన నీటినే ప్రజలు తాగేవారు. మారుతున్న కాలానుగుణంగా తాగేనీళ్ల కలుషితం కావడంతో ప్యూరిఫైడ్ వాటర్, వాటర్‌ప్లాంట్లపై జనాల్లో ఆసక్తి పెంచుకున్నారు. గతంలో బావుల్లో నీళ్లు తెచ్చుకుని తాగేవారు. ప్రస్తుతం బావులు కనుమరుగయ్యాయి. బోర్లు వేసి వాటికి వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్యూరిఫైడ్ చేసి వారు క్యాన్ల ద్వారా సప్లై చేసే నీటిని తాగే అలవాటుగా మారింది. దీంతో స్వచ్ఛమైన తాగునీరు అందకుండా పోతోంది. వాటర్ ప్లాంట్ల ద్వారా క్యాన్లను నింపి డోర్ టు డోర్ డెలివరీ చేసేవారు క్యాన్లు రోజూ క్లీన్ చేయాల్సి ఉంటుంది. అంతేకాక ప్యూరిఫైడ్ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. చాలా మంది తమ ఆదాయమే పరమావధిగా భావించి వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు.

గతంలో రెండు, మూడు మాత్రమే ఉండే వాటర్‌ప్లాంట్లు ప్రస్తుత వీధికొకటి తయారయ్యాయి. పోరుమామిళ్ల, రంగసముద్రం పంచా యతీల్లో దాదాపు 25 మినరల్ వాటర్‌ప్లాంట్లు ఉన్నాయి. క్యాన్ దాదాపు రూ.15 వంతున అమ్మకాలు సాగిస్తున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో గతంలో కొందరు రూ.5కే పంచాయతీ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్లలో నీరందించేవారు. కానీ వ్యాపారులు ఆటోల్లో క్యాన్లను వీధుల్లో పంపుతూ రూ.15 వంతున వసూలు చేస్తున్నారు. రూ.5కే నీళ్లు రావాలంటే సచివాలయ పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆ వాటర్ ప్లాంటు వద్దకు వెళ్లాల్సిందే. కానీ ఈ వాటర్ క్యాన్లను శుద్ధి చేయడంలో యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతేకాక ఇవి శుద్ధి చేయకపోవడం వల్ల క్యాన్లలో బ్యాక్టీరియా చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వాటర్‌ట్యాంకు యజమానులు ప్యూరిఫై చేసేటప్పుడు అందులో ఎక్కువ భాగం నీళ్లు వృథా అవుతుంటాయి. ఆ నీటిని కూడా వారు బయటికి మళ్లించాల్సి ఉంటుంది. కొందరైతే ఈ నీటిని కూడా తమ వ్యాపారానికి అనుకూలంగా మలుచుకుంటున్నారు. వాటర్‌ప్లాంట్లపై అధికారులు అప్పుడప్పుడూ తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది. ఎన్నింటికి అనుమతులు ఉన్నాయి. ఏ వాటర్ ప్లాంట్లు నాణ్యతను పాటిస్తున్నాయి, ఏ వాటర్‌ప్లాంటు యజమానులు నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారనే విషయంపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. అలా చేస్తే వాటర్‌ప్లాంటు యజమానులు ప్లాంట్లను శుద్ధి చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీరందించే అవకాశాలు ఉన్నాయి.





ఆటోలో వాటర్‌క్యాన్లను తీసుకెళుతున్న దృశ్యం, వాటర్‌ప్లాంటు